సాక్షి నంద్యాల

ఆదివారం । 3 । మార్చి । 2024



8 టీఎంసీల నీటి నిల్వ

హొళగుంద: తుంగభద్ర జలాశయంలో 8.377 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తాగునీటి అవసరాల నిమిత్తం గత నెల 19 నుంచి ఎల్లెల్సీకి విడుదల చేస్తున్న నీటిని ఈ నెల 10న నిలిపివేయనున్నారు.



భూముల పరిశీలన

పాణ్యం: పిన్నాపురం గ్రామంలో సోలార్ పార్కు భూముల వివరాలను శనివారం నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు పనులపై ఆరా తీశారు.



అడవుల సంరక్షణకు చర్యలు

కర్నూలు కల్చరల్: అడవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌ఓ శివశంకర్‌రెడ్డి ఆదేశించారు. కోటేకల్ నగరవనం ఏర్పాటుకు రూ.1.40 లక్ష నిధులు మంజూరయ్యాయన్నారు.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి




అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ

నంద్యాల(సిటీ): పోలింగ్ బూత్ కేంద్రాల్లో నిర్ణీత గడువులోగా వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణ పరిధిలో పలు పోలింగ్ బూత్‌లను మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ప్రతి బూత్ వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక ర్యాంప్, వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అధికారులంతా సమన్వయ లోపం తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఎన్నికల డీటీ రమాదేవి, డీఈఈలు జయభారత్ రెడ్డి, మధుకుమార్, రూట్ ఆఫీసర్లు, ఆర్ఐ యుగంధర్ ఉన్నారు.

రేపటి సీఎం పర్యటన తాత్కాలిక వాయిదా

బనగానపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లె పర్యటన తాత్కాలికంగా వాయిదా పడింది. ఈనెల 4న పట్టణంలో ఈబీసీ నేస్తం నిధుల విడుదల, వంద పడకల ఆసుపత్రిని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో సీఎం పర్యటన రద్దయిందని, తదుపరి పర్యటన తేదీని త్వరలోనే ప్రకటిస్తారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.5.16 లక్షలు



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం


బేతంచెర్ల: శ్రీ లక్ష్మీ గణమద్దిలేటి నరసింహ స్వామికి మాఘ మాసం శనివారం సందర్భంగా రూ.5.16 లక్షల ఆదాయం వచ్చింది. వేకువ జాము నుంచే ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తులు వివిధ సేవలు నిర్వహించుకోవడంతో దేవస్థానానికి రూ.5,16,820 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ. రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. డోన్ పట్టణానికి చెందిన వెంకట సుబ్బయ్య భార్య జయప్రద 350 గ్రాముల వెండి వస్తువులను సమర్పించారు.

ఫ్యాన్ జోరు.. సైకిల్ బేజారు

డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డి బలప్రదర్శనతో తిరుగుబాటు

- మీసం మెలేసిన వైనం.. చంద్రబాబు నమ్మించి గొంతుకోశారని ఆవేదన
- ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు నిర్ణయం
- ఆలూరులో ఓ డీఎస్పీకి టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధమైన టీడీపీ
- అదే జరిగితే రాజీనామా బాటలో ఆ పార్టీ ముఖ్య నేతలు
- కర్నూలులో ఇంతియాజ్ రాకతో వైఎస్సార్‌సీపీలో జోష్.. టీజీ కుటుంబంలో నిర్వేదం
- తక్కిన ఐదు టీడీపీ స్థానాల్లో కొత్త ముఖాలకు అవకాశం

సార్వత్రిక పోరులో అధికార పార్టీ ప్రచారపర్వంలో దూసుకెళ్తుంటే.. తెలుగుదేశంపార్టీ టిక్కెట్ల తగువులాటలో కొట్టుమిట్టాడుతోంది. డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డి టీడీపీపై తిరుగుబాటు చేస్తే, ఎమ్మిగనూరులో టిక్కెట్ కోసం జయనాగేశ్వరరెడ్డి వర్గం నిరసన ప్రదర్శనలకు దిగుతోంది. ఆలూరులో పార్టీ కోసం శ్రమించిన వారికి కాకుండా డీఎస్పీని బరిలోకి దించేందుకు సిద్ధమైంది. ఇదే జరిగితే పార్టీకి రాజీనామా చేస్తామని జెండా మోసిన నేతలు హెచ్చరిస్తున్నారు. ఇలా చాలా నియోజకవర్గాల్లో అసంతృప్తిజ్వాల రగులుతోంది. ఇదే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయంతో ఎన్నికలకు సన్నద్ధమవుతోంది.



సాక్షి ప్రతినిధి, కర్నూలు: సార్వత్రిక పోరు సమీపిస్తోంది. వచ్చే వారంలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఇప్పటి వరకు టీడీపీలో టిక్కెట్ల కేటాయింపు పూర్తి కాని పరిస్థితి. మరోవైపు టిక్కెట్లు ప్రకటించిన స్థానాల్లో నిరసనల వెల్లువ ఆగడం లేదు. డోన్‌లో తనను కాదని కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి టిక్కెట్ ఇవ్వడంతో ధర్మవరం సుబ్బారెడ్డి తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. తన వర్గంతో బలప్రదర్శనకు దిగి మీసం మెలేశారు. చంద్రబాబు తనను నమ్మించి గొంతుకోశారని, ముందుగా ప్రకటించినా తనకు టిక్కెట్ లేకుండా చేసిన కోట్ల, కేఈ కుటుంబాలకు సహకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బలప్రదర్శనలో ఎక్కడా చంద్రబాబు, లోకేశ్ ఫొటోలు ఫ్లెక్సీల్లో కన్పించకపోవడం గమనార్హం. ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు సుబ్బారెడ్డి అనుచరులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఇదే జరిగితే టీడీపీకి కోలుకోలేని దెబ్బే!

టీజీ కుటుంబంలో నిర్వేదం

కర్నూలు వైఎస్సార్‌సీపీలో కొత్త జోష్ వచ్చింది. కర్నూలు సమన్వయకర్తగా ఇంతియాజ్‌ను నియమించారు. ఈ నియామకం టీజీ కుటుంబంలో నిర్వేదాన్ని నింపింది. ఇంతియాజ్ మామ, డాక్టర్ ఇస్మాయిల్ మైనార్టీ వర్గంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న వ్యక్తి. టీజీ కుటుంబం గెలుపులో ఇస్మాయిల్ కీలకంగా పని చేశారు. మెజార్టీ మైనార్టీ ఓట్లు టీజీ కుటుంబానికి పోలయ్యేలా చూడటంలో గతంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఇప్పుడు ఇంతియాజ్‌కు టిక్కెట్ దక్కడంతో మైనార్టీ వర్గం మొత్తం ఏకమైంది. ఇంతియాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలనే చర్చ మైనార్టీ వర్గాల్లో నడుస్తోంది. దీంతో మైనార్టీ ఓట్లు పూర్తిగా టీజీ కుటుంబానికి దూరమైనట్లే. ఇంతియాజ్‌కు మైనార్టీలతో పాటు అన్ని వర్గాల్లో మంచిపేరు ఉంది. పైగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. అలాంటి వ్యక్తిని గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి కూడా బాగుంటుందనే చర్చ విద్యావంతుల్లో కూడా వ్యక్తమవుతోంది. మరోవైపు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి, మేయర్ రామయ్య అంతా సమష్టిగా ఇంతియాజ్ కోసం కలిసి పనిచేస్తున్నారు. ఈ పరిణామాలతో వైఎస్సార్‌సీపీలో జోష్ ఉంటే, టీజీ కుటుంబం నిర్వేదంలో కనిపిస్తోంది.

ఆలూరులో తలనొప్పిగా పోలీస్ పంచాయితీ!

ఆలూరు టిక్కెట్ కోసం కోట్లసుజాతమ్మ తీవ్రంగా యత్నిస్తున్నారు. మొదటి జాబితాలో తన పేరు లేకపోవడంతో ఆమెకు దాదాపుగా టిక్కెట్ లేనట్లేనని తెలుస్తోంది. ఇక్కడ టీడీపీ కూడా బోయ వర్గానికి టిక్కెట్ ఇవ్వాలనే యోచన చేస్తోంది. ఈ క్రమంలో ఓ డీఎస్పీని సంప్రదించినట్లు తెలుస్తోంది. డీఎస్పీ కూడా ఉద్యోగానికి రాజీనామా చేసి ఖాకీ చొక్కా తీసేసి, ఖద్దరు వేసుకునేందుకు సిద్ధమయ్యారు. డీఎస్పీ చేరికను టీడీపీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సుజాతమ్మ, వైకుంఠం, వీరభద్రగౌడ్‌లో ఒకరికి టిక్కెట్ ఇవ్వాలని ముగ్గురూ గట్టిగా పట్టుబడుతున్నారు. పార్టీకి సంబంధం లేని వారికి ఇస్తే తాము కూడా ప్రత్యామ్నాయాలు చూసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ఆ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పునకు నిర్ణయం

14 నియోజకవర్గాల్లో 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ తక్కిన 5 స్థానాలపై కూడా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మంత్రాలయంలో తిక్కారెడ్డి స్థానంలో రాఘవేంద్రకు, ఎమ్మిగనూరులో జయనాగేశ్వరరెడ్డి స్థానంలో మాచాని సోమనాథ్, నందికొట్కూరులో ప్రస్తుతం ఉన్న జయసూర్య, కాకరవాడ వెంకటస్వామి, బండి జయరాజు టిక్కెట్లు ఆశిస్తున్నారు. వీరి ముగ్గురూ కాకుండా కొత్త వ్యక్తిని తెరపైకి తెచ్చేందుకు టీడీపీ సిద్ధమైంది. పైగా నందికొట్కూరుకు మరో సమస్య తలెత్తింది. పాణ్యం, నంద్యాల ఎంపీ స్థానాలు ఆశించి బైరెడ్డి రాజశేఖరరెడ్డి కుటుంబం టీడీపీలో చేరాలని నిర్ణయం తీసుకుంది. కార్యకర్తల సమావేశాన్ని కూడా నిర్వహించింది. అయితే పాణ్యం టిక్కెట్ ఖరారు చేయడంతో బైరెడ్డి డైలమాలో పడ్డారు. చివరకు నంద్యాల ఎంపీతో పాటు నందికొట్కూరు టిక్కెట్ తాము చెప్పిన అభ్యర్థికి ఇవ్వాలనే ప్రతిపాదన పెట్టినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే నందికొట్కూరు టిక్కెట్ ఆశిస్తోన్న ముగ్గురు కాదని మరో వ్యక్తి తెరపైకి వచ్చే అవకాశమూ ఉంది. ఇంకోవైపు ఏవీ సుబ్బారెడ్డి, రియల్టర్ నరసింహారావు కూడా ఎంపీ టిక్కెట్ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. డబ్బు మూటలే అర్హతగా టీడీపీ చూస్తుండటంతో మాండ్ర శివానందరెడ్డి, ఏవీ కంటే నరసిహంహారావు ఎక్కువగా డబ్బులు పెట్టుకునే శక్తి ఉండటం, బలిజ సామాజికవర్గం కావడంతో ఇతని పేరు కూడా కీలకంగా పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీకి డబ్బు మూటలు సర్దే కోవెలకుంట్లకు చెందిన ఓ ఎన్ఆర్ఐ ఇతని పేరును సిఫార్సు చేసినట్లు సమాచారం. ఇక ఆదోనిలో మీనాక్షినాయుడు కుటుంబాన్ని పూర్తిగా పక్కన పెట్టేసినట్లుగా తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో కనీసం ఒక సీటైనా కావాలని జనసేన పట్టుబట్టడంతో ఆదోని ఇచ్చే యోచన చేస్తోంది. ఇక్కడ టీజీ విశ్వప్రసాద్ లేదా అతను మద్దతు ఇచ్చిన వ్యక్తికి టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధమైంది.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 633 మంది గైర్హాజరు



నలంద కళాశాలలో పరీక్షను తనిఖీ చేస్తున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. నంద్యాల జిల్లాలో 52 పరీక్ష కేంద్రాల్లో 10,178 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 9,607 మంది హాజరయ్యారు. 571 మంది గైర్హాజరయ్యారు.అదే విధంగా ఒకేషనల్‌కు సంబంధించి 960 మందికి గాను 898 మంది హాజరు కాగా 62 మంది గైర్హాజరయ్యారని డీవీఈఓ సునీత తెలిపారు. నంద్యాల పట్టణంలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఎస్‌వైపీ జూనియర్ బాలికల కాలేజీ, నలంద కాలేజీలను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సలహాలు, సూచలను ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

89.91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. శనివారం తెల్లవారుజాము నుంచి వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ లబ్ధిదారులకు పింఛన్ మొత్తం అందజేశారు. ఈనెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 2,23,601 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 2,01,032 మందికి 89.91 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్లు పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ తీసుకోవచ్చన్నారు.



భక్తజనం మధ్య గ్రామోత్సవ దృశ్యం



మల్లన్నకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ద్వారకా తిరుమల దేవస్థానం అధికారులు, మండలి సభ్యులు



ఉత్సవంలో కళాకారుల కోలాటం

భృంగి వాహనాధీశా.. పాహిమాం

- శ్రీగిరిలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల శోభతో శ్రీగిరి క్షేత్రం ఇల కైలాసాన్ని తలపిస్తోంది. పురవీధులు భక్తులతో పోటెత్తుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి భృంగివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా భృంగి వాహనాన్ని పలు సుగంధ పుష్పాలతో అలంకరించారు. స్వామిఅమ్మవారల ఉత్సవమూర్తులను భృంగి వాహనంపై ఉంచి అలంకార మండపంలో అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజా హారతులిచ్చారు. అనంతరం భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవారలను గ్రామోత్సవానికి తరలించగా దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, చైర్మన్ చక్రపాణిరెడ్డి తదితరులు నారికేళాలు సమర్పించి ఉత్సవాన్ని ప్రారంభించారు. పరివార దేవతామూర్తులకు కర్పూర నీరాజనాలు సమర్పించుకుంటూ ఉత్సవాన్ని ఆలయం వెలుపలకి తోడ్కొనివచ్చారు. ఉత్సవం ముందు పలువురు కళాకారుల నృత్యాలు, కోలాటలు, నాదస్వరం, చెక్కభజనలు, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంబాయ్‌ఢోల్ థాషా, మహిళా వీరగాసి కన్నడ జానపద కళా ప్రదర్శన, పురుషుల వీరగాసి కన్నడ కళా ప్రదర్శన, కాళికానృత్యం భక్తులను అలరించాయి. భక్తుల శివనామస్మరణతో, కళాకారుల సందడితో పరమేశ్వరుడి పరమ భక్తుడైన భృంగి పులకించిపోయారు. వేలాది మంది భక్తులు భృంగి వాహనాధీశులైన స్వామిఅమ్మవార్ల దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించి దీవెనలిమ్మని వేడుకున్నారు. గంగాధర మండపం నుంచి నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం శోభయమానంగా సాగింది.

శ్రీశైలంలో నేడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు ఆదివారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవారులు హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం ఆలయ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహిస్తారు. అలాగే విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వారిచే శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

మల్లన్నకు పట్టు వస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ద్వారకా తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీశైల మల్లన్నకు పట్టువస్త్రాలు సమర్పించింది. శనివారం ద్వారకా తిరుమల దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి బాబురావు, ఉప ప్రధానార్చకులు కొండూరి జనార్ధనాచార్యులు, పెద్దంటి ఫణికుమార్, సహాయ కార్యనిర్వహణాధికారి పి.నటరాజరావు, వేద పండితులు మహేష్‌కుమార్ శర్మ, రవికుమార్‌శర్మ, వెంకటేశ్వరశర్మ పట్టువస్త్రాలు తీసుకుని ఆలయానికి వచ్చారు. ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో సంప్రాయబద్ధంగా స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

కుట్రల కూటమిని ప్రజలు నమ్మరు

- కోట్ల, కేఈ కుటుంబాలు కలిసినా టీడీపీకి ఓటమి తప్పదు
- ప్రజలకు మేలు చేసి ఓట్లు అడుగుతున్నాం
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మహిళకు ఇంటి హక్కు పత్రాలను అందిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ రూరల్: 'కోట్ల, కేఈ కుటుంబాలు ప్రత్యర్థులుగా ఉండి ఎంతో మంది అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్నారు. ఈ రెండు కుటుంబాలు గతంలో ఒక్కటై ఉంటే వందల మంది ప్రాణాలు నిలబడేవి. ఇప్పుడు కేవలం అధికారమే పరమావధిగా స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. వారి కుట్రల కూటమిని ప్రజలు నమ్మరు' అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. డోన్ పట్టణంలో స్థానిక సాయి ఫంక్షన్ హాల్‌లో శనివారం ఇంటి హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా 5 వేల మంది లబ్ధిదారులకు ఇంటి హక్కు పత్రాలను అందించారు. అనంతరం మంత్రి బుగ్గన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అర్హులందరికీ కూడా రూ. లక్షలు విలు చేసే స్థలాన్ని కేటాయించి వారికి పూర్తి హక్కును కూడ కల్పించడం జరగిందన్నారు. ఇళ్లు లేని ప్రతి పేదవాడు ఈరోజు ఇళ్లు నిర్మించుకొని సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రమంతటా కూడా కేవలం ప్రతి లబ్ధిదారికి సెంట్ స్థలం ఇస్తే కేవలం డోన్‌లో మాత్రమే సెంటున్నర స్థలం ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. మేలు ఎవరు చేశారో ప్రజలు గుర్తించి ఎన్నికల్లో ఓట్లు వేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల,మత, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఏపీఐఐసీ డైరెక్టర్ పుల్లారెడ్డి, ప్యాపిలి జెడ్పీటీసీ శ్రీరాములు, ఆర్డీవో మహేశ్వర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంఎస్ఎంఈ సర్వే పకడ్బందీగా చేయండి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు

నంద్యాల: ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్‌లో భాగంగా పరిశ్రమల శాఖ నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వే పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌ను జిల్లాలోని పరిశ్రమలకు అనుసంధానం చేయడం కోసం ఎంఎస్ఎంఈ సర్వేను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీం ద్వారా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ ఏకీకృత పోర్టల్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఎంఎస్ఎంఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్యరంగంలోని అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్ ఫామ్‌లోకి తీసుకువచ్చి ఏపీ ఎంఎస్ఎంఈ.వన్ పోర్టల్‌కు అనుసంధానించడం ద్వారా ఎంఎస్ఎంఈల డేటా బేస్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా ఉద్యమ్ పోర్టల్లో నమోదుకాని ఎంఎస్ఎంఈలను గుర్తించి వారికి అవగాహన కల్పించే విధంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఎంఎస్ఎంఈలకు చేయూతనిచ్చే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ర్యాంప్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాస యాదవ్, పరిశ్రమల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ పరిధిలోని గృహాలకు, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను చెల్లింపులపై మొత్తం వడ్డీ మాఫీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి శనివారం తెలిపారు. నంద్యాల మున్సిపాలిటీకి సంబంధించి 2022–23 సంవత్సరానికి బకాయి రూ.4కోట్లు ఉందన్నారు. అలాగే 2023–24 పన్నుల డిమాండ్ రూ.5కోట్లుగా ఉందన్నారు. గత రెండు రోజులకు సంబంధించి రూ.5.72 లక్షలు వసూలైనట్లు ఆర్‌ఓ వెంకట కృష్ణ చెప్పారు.

8న ఈ–క్రాప్ తుది జాబితా ప్రదర్శన

నంద్యాల(సెంట్రల్): 2023–24 రబీ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ జాబితాను ఈనెల 8వ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు శనివారం వెల్లడించారు. రబీ సీజన్‌లో మొత్తం 1,02,561 మంది రైతులకు సంబంధించి 3.39 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, 99.97 శాతం పంటల నమోదు (ఈ–క్రాప్) చేశామన్నారు. ఇందులో 99,146 మందికి సంబంధించి 31,642 మంది అన్నదాతలకు చెందిన 3,31,462 ఎకరాల్లో 97.69 శాతం రైతుల ఈ–కేవైసీ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ముసాయిదా జాబితాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నామన్నారు.



పుణ్యస్నానం: పాతాళగంగ వద్ద భక్తుల రద్దీ



పుష్పశోభితం: అలంకరణలో ధ్వజస్తంభం



భక్తిభావం: బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు వెళ్తున్న భక్తులు

శ్రీగిరి..భక్తజన ఝరి!

శ్రీశైల వాసా.. శరణు మల్లన్న అంటూ భక్తజనులు నీరాజనాలు పడుతున్నారు. నల్లమల అభయారణ్యం మీదుగా పగలు, రేయి, చిన్నాపెద్దా తేడా లేకుండా పాదయాత్రగా శ్రీగిరికి చేరుకుంటున్నారు. పాతాళగంగలో పవిత్ర స్నానాలు ఆచరించి మల్లికార్జునుడి దర్శనానికి బారులుదీరుతున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. విద్యుత్ దీపాలంకరణలో ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. గ్రామోత్సవంలో ఉత్సవ మూర్తులైన ఆదిదంపతులను చూసి భక్తజనం పులకించిపోతోంది.

– శ్రీశైలంటెంపుల్



సడలని దీక్ష: జ్యోతిర్ముడితో మల్లన్న చెంతకు..



నడక మార్గం: నల్లమల అడవిలో పాదయాత్ర చేస్తున్న భక్తులు



పంచాక్షరి జపం: ఆలయంలో దర్శనానికి వెళ్తున్న శివస్వాములు



నృత్యనీరాజనం: నృత్య ప్రదర్శన ఇస్తున్న బాలికలు



దర్శనం..పరమపావనం: క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

కోలుకోలేక వ్యక్తి మృతి

బొమ్మలసత్రం: స్థలం విషయంలో బెదిరింపులకు పాల్పడటంతో ఆత్మహత్యకు యత్నించిన నంద్యాల పట్టణానికి చెందిన షేక్ అలీబాషా (41) ఆసుపత్రిలో కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతి చెందాడు. త్రీటౌన్ సీఐ నరసింహులు శనివారం తెలిపిన వివరాల మేరకు.. షేక్ అలిబాషా, రేష్మా దంపతులు బొమ్మలస త్రం సమీపంలోని ఇస్లాంపేటలో నివాసముంటున్నారు. అలీబాషా చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థలం విషయంలో అలీబాషా, ఉబేదుల్లాతో నాలుగేళ్లుగా వివా దం నడుస్తోంది. ఇద్దరూ కోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలో ఈనెల 27న అలీబాషా ఇంటికి వెళ్లి ఉబేదుల్లా బెదిరింపులకు పాల్పడ్డాడు. మనస్తాపానికిగురైన అలీబాషా రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన భార్య కేకలు వేయటంతో సమీపంలోని వారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్రహ్మోత్సవాల్లో విద్యుత్ సమస్య రానివ్వం

- విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం. ఉమాపతి



కర్నూలు(అగ్రికల్చర్): శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాల్లో ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ...ఈ నెల 6 నుంచి నలుగురు ఏడీఈలు, 8 మంది ఏఈఈలు, 70 మంది సిబ్బందిని శ్రీశైలంలో ఉండి విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటారన్నారు. ఇప్పటికే పది మంది సిబ్బందిని శ్రీశైలానికి పంపించామన్నారు. శిఖరం నుంచి శ్రీశైలం వరకు రోడ్డు పక్కనే 120 పోల్స్ ఉన్నాయని, వాహన దారులు జాగ్రత్తగా వెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు. శ్రీశైలంలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి వైర్‌లెస్ సెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం, మహానంది, యాగంటి, బ్రహ్మగుండం, ఓంకారం, బోగేశ్వరం తదితర శైవ క్షేత్రాల్లో నెలకొల్పుతున్న షాపులకు వేసిన విద్యుత్ వైర్లను ముందు జాగ్రత్తగా 100 శాతం పరిశీలించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో డీఈఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హొలగుంద: మండలంలోని అర్ధగేరి గ్రామానికి చెందిన యువకుడు ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రం సరిహద్దు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. అర్ధగేరి గ్రామానికి చెందిన సి.రాజు(25) శనివారం రాత్రి కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా మోకా గ్రామంలో మాల మల్లేశ్వరస్వామి రథోత్సవాన్ని చూసుకొని బైక్‌పై ప్రయాణమయ్యాడు. మోకా ఫారెస్ట్ దగ్గర ట్రాక్టర్, మోటారు సైకిల్ ఢీకొనడంతో సి. రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితున్ని అరెస్ట్ చేసిన పోలీసులు

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రం నంద్యాలలో జరిగిన కానిస్టేబుల్ సురేంద్రనాథ్ హత్య కేసులో పరారీలో ఉన్న ఏ2 నిందితుడు సాకె రాజ్‌కుమార్ (పెద్ద)ను ఎట్టకేలకు శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకూ... 2022 ఆగస్టు 7వ తేదీ టూటౌన్ పరిధిలోని పద్మావతినగర్ ఆర్చ్ దగ్గర కానిస్టేబుల్ సురేంద్రనాథ్ బ్యాగ్‌ను రిపేరి చేయించుకుంటున్నాడు. పక్కనే ఉన్న ట్యాటూ షాప్‌లో రౌడీషీటర్ సాయి (కవ్వ), రాజ్‌కుమార్‌లు మరో 10 మందితో కలిసి మద్యం సేవిస్తూ గట్టిగా కేకలు వేస్తుండగా సురేంద్ర వారిని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో సురేంద్ర తలపై బీరు సీసాలతో దాడి చేయటంతో సురేంద్ర అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసి రాజ్ థియేటర్ వైపు పరుగెత్తాడు. కానిస్టేబుల్ సురేంద్ర పారిపోతుండగా నిందితులు వెంబడించి పట్టుకుని ఒక ఆటోలో చిన్న చెరువుకట్ట వైపు వెళ్లారు. అక్కడ సురేంద్రను కత్తులతో పొడిచి రక్తపు మడుగులో ఉన్న సురేంద్రను ఆసుపత్రి ముందు వదిలి నిందితులు పరారయ్యారు. కేసులో మొత్తం 12 మంది నిందితులను గుర్తించిన పోలీసులు వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. 11 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న రాజ్‌కుమార్‌ను శనివారం రాణిమహారాణి థియేటర్ సమీపంలో గుర్తించి పోలీసులు అరెస్ట్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ రాజారెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

'వార్షికం'లో తప్పారా.. నో వర్రీ!

- డిగ్రీ పూర్తి చేసేందుకు సువర్ణ అవకాశం
- 2008 నుంచి 2014 మధ్య ఫెయిలైన వారికి పరీక్షల నిర్వహణ

కర్నూలు కల్చరల్: వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి మరో సారి పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల వినతితో స్పందించిన వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ ఆర్‌యూ అధికారులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

15,275 మంది విద్యార్థులకు అవకాశం

అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న కర్నూలు పీజీ సెంటర్ 2008వ సంవత్సరంలో విశ్వవిద్యాలయంగా మారింది. అప్పటి నుంచి 2014వ సంవత్సరం వరకు డిగ్రీ లో వార్షిక పరీక్షలు నిర్వ హించారు. 2015 నుంచి వార్షిక పరీక్షల స్థానంలో సెమిస్టర్ పరీక్షలను ప్రవేశ పెట్టారు. అయితే వార్షిక పరీక్షల్లో ఫెయి లైన విద్యార్థులకు గతంలోనే పరీక్షలు నిర్వహించారు. సెమిస్టర్ సిస్టమ్ అమల్లోకి వచ్చాక వార్షిక పరీక్షలను నిర్వహించలేదు. దీంతో 2008 నుంచి 2014 సంవత్సరాల మధ్యలో ఫెయిలైన 15,275 మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేయలేక పోయారు. సిటిజన్‌షిప్ ఎడ్యుకేషన్ -3లో 9,958, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్-2లో 7,310, ఇంగ్లీష్-2లో 6,946, తెలుగు -2లో 6,745, ఇంగ్లీష్-2 (ల్యాబ్)లో 6,141, కార్పోరేట్ అకౌంటింగ్-3లో 4,590, బిజినెస్ లాస్-3లో 4,391, కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్-3లో 4,348, ఆడిటింగ్-3లో 4,189 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా.. వీరందరూ పరీక్షలు రాసే అవకాశం ఉంది.

వారంలోగా నోటిఫికేషన్

డిగ్రీ పూర్తయితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. సుమారు 15 వేల మందికి పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నాం. విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే నిర్ణయాలు తీసుకొని వాటిని కచ్చితంగా అమలు చేస్తాం. వారం రోజుల్లోగా నోటిఫికేషన్ విడుదల ఇస్తాం. – ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్, వైస్‌ఛాన్సలర్, ఆర్‌యూ

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించండి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల టౌన్: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఈనెల 3వ తేదీ ఆదివారం జరిగే జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి టెక్కె వరకు నిర్వహించిన పల్స్ పోలియో ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని, ప్రతి సారి రెండు పోలియో చుక్కలు వేయించడం వల్ల పోలియో అరికడుతున్నామన్నారు. పోలియో చుక్కలు వేయించండి.. పోలియో వ్యాధిని తరిమి కొట్టండి అనే నినాదాల ద్వారా ప్రజలకు పోలియో వ్యాధిపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేక పోయిన పిల్లలను గుర్తించేందుకు 4, 5 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడతామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలియో మహమ్మారిని మన దేశం నుంచి పారదోలేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాదరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి, మున్సిపల్ హెల్త్ అధికారి, అంకిరెడ్డి ఇంచార్జ్ డెమో రవీంద్ర నాయక్, ఎంపీహెచ్ఈఓ జగదీశ్వరప్ప, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో

- 1,313 బూత్‌ల ఏర్పాటు
- జిల్లాలో 2,34,382 మంది చిన్నారులు

నంద్యాలటౌన్: పోలియో మహమ్మారి తరిమికొట్టేందుకు పల్స్ పోలియో కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. మార్చి 3వ తేదీ ఆదివారం ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కల మందు అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా 2,34,382 మంది 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకు గాను 5,252 మంది సిబ్బందితో పల్స్ పోలియో నిర్వహించనున్నారు. అలాగే 158 మంది సూపర్‌వైజర్లు, 1,680 మంది అంగన్‌వాడీలు, 1,597 ఆశలు, 369 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 514 మంది ఏఎన్ఎంలు ఇతర సిబ్బంది పాల్గొననున్నారు. ఒక్క రోజులోనే 0–5 ఏళ్ల వయస్సు లోపు చిన్నారులకు అందరికీ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,313 బూత్‌లు ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇవే కాకుండా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో 60 మొబైల్ టీంల ద్వారా కూడా పోలియో చుక్కలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 4, 5 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా 2,626 టీమ్‌లు ఇంటింటికి తిరిగి బూత్ లెవెల్‌లో పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయనున్నారు.